కేసీఆర్.. గుడి సూపర్

› మొదటిపేజీ తరువాయి...

శాసనసభ ప్రశంసించాయి. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కృష్ణశిలతో ఆలయాన్ని నిర్మించిన కేసీఆర్‌ను పలువురు కీర్తించారు. ఆలయాలపై కేసీఆర్‌కు ఉన్న అభిలాషతోనే యాదగిరిగుట్ట నిర్మాణం సాధ్యమైందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కొనియాడారు. విమాన గోపురం బంగారు తాపడం నిర్మాణం కోసం ఎందరో దాతలను కలిసి కేసీఆర్ మాట్లాడారని గుర్తుచేశారు. ఆలయాన్ని ఎవరు నిర్మించారనే అంశం చర్చకు వస్తే కేసీఆర్ పేరే చెబుతారని, చరిత్రను ఎవరూ మార్చలేరని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఎవరూ అవునన్నా, కాదన్నా యాదగిరిగుట్ట ఆలయ నిర్మాణ క్రెడిట్ కేసీఆర్‌కే దక్కుతుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) మాదిరిగా తెలంగాణ తొలి సీఎం కే చంద్రశేఖర్‌రావు యాదగిరిగుట్ట నిర్మాణం చేపట్టారని గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రశంసించారు. మంగళవారం శాసనమండలిలో దేవాదాయ, ధర్మాదాయ, వైటీడీఏ బోర్డు బిల్లుపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ.1800 కోట్లతో యాదగిరిగుట్ట నిర్మాణం, యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో అద్భుతమైన రహదారులు వేయించారని పేర్కొన్నారు. కేసీఆర్ విజ్ఞప్తి మేరకు చాలా మంది దాతలు బంగారం సమర్పించారని పేర్కొన్నారు. దేవాలయం ఆవరణలో అద్భుతంగా కాటేజీలు ఏర్పాటు చేశారని చెప్పారు. యాదగిరిగుట్ట బోర్డుకి నిబద్ధత గల అధికారిని నియమించాలని సూచించారు. కేసీఆర్ ఆలోచనకు అనుగుణంగా ఈ ప్రభుత్వం కూడా యాదగిరిగుట్టకు అద్భుత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఆలయాన్ని అభివృద్ధి చేసింది కేసీఆరే: మంత్రి కొండా సురేఖ

యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణంలో కేసీఆర్ కృషి ఉందని, చరిత్ర చరిత్రగానే ఉంటుందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఆలయం ఎవరు నిర్మించారంటే... కేసీఆరే కట్టారని ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఇందులో తమకు రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని, కేసీఆర్ మనసు పెట్టి ఆలయాన్ని నిర్మించారని చెప్పారు. ఆలయ నిర్మాణ పనుల్లో పాలుపంచుకునే అవకాశం రావడం అప్పటి మంత్రి ప్రశాంత్ రెడ్డి అదృష్టమని మంత్రి తెలిపారు. ముందుగా బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి కొండా సురేఖ ఆలయ అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ వివరాలు వెల్లడించారు.

కేసీఆర్‌కు కృతజ్ఞతలు: రాజగోపాల్‌రెడ్డి

యాదాద్రి ఆలయ క్రెడిట్ మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కొనియాడారు. 'గుడి కట్టినా, బడి కట్టినా, ప్రాజెక్టు కట్టినా ప్రజల ధనంతోనే కేసీఆర్ కట్టారు. యాదగిరిగుట్ట దేవస్థానం కట్టాలని దేవుడు ఆయనకు ఆలోచన కల్పించడం గొప్పవిషయం. అందుకు అనుగుణంగా తెలంగాణ వచ్చిన వెంటనే చాలా గొప్పగా కట్టారు. యాదాద్రి ఆలయాన్ని పునర్నిర్మించినందుకు కాంగ్రెస్ పార్టీ తరపున, ప్రభుత్వం తరపున మనస్ఫూర్తిగా కేసీఆర్‌ను కృతజ్ఞతలు తెలుపుతున్నా. ఇందులో రాజకీయాలు ఏమీ లేవు. మేము మంచి చేస్తే మీరూ మెచ్చుకోవాలి. వైటీడీ కాకుండా.. యాదగిరిగుట్ట దేవస్థానం (వైజీడీ)గా పేరు మార్చాలి' అని సూచించారు.

కేసీఆర్ కృషిని మర్చిపోవడం బాధాకరం...

ఎంఐఎం సభ్యుడు కౌసర్ మొయినొద్దీన్ యాదాద్రి ఆలయాన్ని కేసీఆర్ చక్కగా నిర్మించారని కొనియాడారు. కానీ, ఈ బిల్లు పెట్టిన మంత్రి కొండా సురేఖ మాత్రం మాటమాత్రంగానైనా కేసీఆర్ కృషిని ప్రస్తుతించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ దేశంలో కొందరు రాజకీయాల కోసం దేవుడిని ఉపయోగించుకుంటారని, కానీ కేసీఆర్ మాత్రం యాదాద్రి ఆలయ నిర్మాణాన్ని ఎక్కడా ప్రచారం కోసం వాడుకోలేదని చెప్పారు. కాంగ్రెస్ సభ్యుడు శ్రీహరి మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట ఆలయాన్ని అభివృద్ధి చేయబట్టే దానికి మంచి ప్రాచుర్యం లభించి, ఆదాయం కూడా భారీగా పెరిగిందని తెలిపారు. సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట ఆలయాన్ని కేసీఆర్ తన బ్రైన్ చైల్డ్‌గా భావించారని, ఆలయాన్ని అభివృద్ధి చేయడం వల్ల నేడు ఆదాయం వస్తున్నదని పేర్కొన్నారు.

2 వేల కోట్లతో యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణం

అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ పదేండ్ల పాలనలోనే తెలంగాణ ఆలయాలు పూర్వవైభవం సంతరించుకున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. రూ.2 వేల కోట్లు వెచ్చించి భక్తిశ్రద్ధలు, బాధ్యతతో తెలంగాణ ఇలవేల్పు యాదగిరిగుట్ట ఆలయాన్ని కేసీఆర్ పునర్నిర్మించారని, వెయ్యేండ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అత్యద్భుతంగా తీర్చిదిద్దారని ఉద్ఘాటించారు. కానీ 15 నెలల కాంగ్రెస్ పాలనలో దేవాదాయ రంగం తిరోగమన దిశలో పయనిస్తున్నదని దుయ్యబట్టారు. 18వ తేదీ వచ్చినా అర్చకులకు వేతనాలివ్వని దుస్థితికి కాంగ్రెస్ సర్కారు తీసుకువచ్చిందని నిప్పులు చెరిగారు. మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వైటీడీఏ బిల్లుపై జరిగిన చర్చలో హరీశ్‌రావు మాట్లాడారు. ఆలస్యంగానైనా యాదాద్రి ఆలయానికి బోర్డు ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, బిల్లుకు సంపూర్ణంగా మద్దతిస్తున్నామని ప్రకటించారు.

కాళేశ్వరం జలాలతో కోనేరు నింపినం..

నాడు కాళేశ్వరం ద్వారా పోచమ్మ సాగర్ నుంచి గంధమల్ల కెనాల్ ద్వారా ఇక్కడి కోనేరును గోదావరి జలాలతో నింపిన అనుభూతిని మరిచిపోలేమని హరీశ్‌రావు తెలిపారు. ధర్మకర్తల బోర్డు కాకుండా మండలిని ఏర్పాటు చేసి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతోపాటు గిరిజన సామాజికవర్గానికి చెందిన సభ్యుడిని నియమించాలని డిమాండ్ చేశారు. టీటీడీ తరహాలో ఈవో, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్స్, ఉద్యోగుల వేతనాలను టెంపుల్ ద్వారానే చెల్లించాలని సూచించారు. పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ కోసం దేవాలయ నిధులు ఖర్చుచేసే దిశగా ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. రూ.100 కోట్లకు పైగా ఆదాయం ఉన్న ఆలయాలకు ట్రస్ట్‌బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. బాసర, భద్రాద్రి, ధర్మపురికి రూ.50 కోట్లు, వేములవాడ ఆలయానికి రూ.70 కోట్లు చొప్పున వెచ్చించి అభివృద్ధి చేశామని చెప్పారు. కాళేశ్వరం ఆలయాన్ని రూ.30 కోట్లతో, కొండగట్టు అంజన్న సన్నిధిని రూ.600 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు చేశామని పేర్కొన్నారు.

వేములవాడ అభివృద్ధిపై దృష్టిపెట్టాలి..

వేములవాడకు ఏటా రూ.127 కోట్లకు పైగా ఆదాయం వస్తున్నదని తెలిపారు. ఈ ఆలయానికి కూడా ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేసి, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విమాన గోపుర నిర్మాణంపై కాంగ్రెస్ సభ్యులు తమను ప్రశ్నించడం విడ్డూరంగా ఉన్నదని పేర్కొన్నారు. సిద్దిపేట నియోజకవర్గం నుంచి తన డబ్బులతో కొనుగోలు చేసిన రెండు కిలోల బంగారాన్ని భక్తులతో కలిసి వెళ్లి ఆలయానికి సమర్పించామని తెలిపారు. కేసీఆర్ కూడా 1 కేజీ 116 గ్రాముల బంగారాన్ని ఇచ్చారని గుర్తుచేశారు.

మా పాలనలోనే పూజారులకు వేతనాలు

ఆలయ పూజారులకు ప్రభుత్వ సొమ్ము ద్వారా వేతనాలు ఇచ్చిన చరిత్ర కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు. కారుణ్య నియామకాల కింద 86 మంది దేవాదాయ శాఖ ఉద్యోగుల కుటుంబీకులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద చేర్పించి నియమించామని గుర్తుచేశారు. కానీ, వారికి వేతనాలు రావడం లేదని, ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారంపై దృష్టిపెట్టాలని కోరారు. ధూపదీప నైవేద్యం రూ.2 వేలను రూ.10 వేలకు పెంచామని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో బ్రాహ్మణ పరిషత్ సంక్షేమ నిధికి రూ.100 కోట్లు ఇచ్చారని చెప్పారు. కేసీఆర్ సమ్మక్క సారక్క ఆలయ నిర్వహణకు రూ.100 కోట్లు కేటాయించారని తెలిపారు. హైదరాబాద్‌లో రూ.10 కోట్లతో బ్రాహ్మణ భవన్ నిర్మాణాన్ని చేపట్టామని, కాంగ్రెస్ వచ్చిన తర్వాత పనులు నిలిచిపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కేసీఆర్ మాదిరిగానే విద్యానిధి కింద విదేశాల్లో చదువుకుంటున్న బ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించాలని డిమాండ్ చేశారు. సీజీఎఫ్‌లో ప్రారంభించిన పనులకు టెండర్లు పిలిచి పూర్తిచేయాలని కోరారు.

కేసీఆర్‌తో ఆ భగవంతుడే కట్టించారు

ఎమ్మెల్సీ కవిత

తెలంగాణ వారసత్వ సంపద యాదగిరిగుట్ట అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. మంగళవారం వైటీడీ బోర్డు బిల్లుపై జరిగిన చర్చలో మాట్లాడుతూ.. కేసీఆర్‌తో ఆ భగవంతుడే ఆలయాన్ని కట్టించినట్టు నమ్ముతున్నానని చెప్పారు. 'ఆలయాన్ని కృష్ణశిలతోనే అద్భుతంగా నిర్మించారు. గత ప్రభుత్వం బోర్డు ఏర్పాటు చేయాలని అనుకున్నది. కానీ కుదరలేదు. యాదగిరిగుట్ట బోర్డు ఏర్పాటు చేయడాన్ని ఆహ్వానిస్తున్నాం. ఆలయ ఉద్యోగులకు జీతాల నుంచి ఉపాధి వరకు ప్రభుత్వమే రిక్రూట్ చేయాలి. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు కొనసాగించేలా కమిటీ కొనసాగాలి' అని సూచించారు.

టీటీడీని చూసి వైటీడీగా పెట్టారా?

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి

వైటీడీ బోర్డు బిల్లుపై జరిగిన చర్చలో బీఆర్‌ఎస్ సభ్యుడు శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం టీటీడీని చూసి వైటీడీ పేరు పెట్టినట్టు అనిపిస్తున్నదని అన్నారు. వైటీడీకి బదులుగా యాదగిరిగుట్ట డెవలప్‌మెంట్ అథారిటీగా పెడితే బాగుండేదని సూచించారు. ప్రస్తుత రాజకీయ నాయకులు ఓట్ల కోసం ప్రయత్నించే వారేనని తెలిపారు. 'ఎప్పుడో రాజుల కాలంలో శ్రీకృష్ణదేవరాయలు గుడులు కట్టించారని విన్నాం. ఇప్పుడు మనందరికి చూసే అదృష్టం కేసీఆర్ కల్పించారు' అని తెలిపారు.

• యాదగిరీశుడిని దర్శించుకున్న మిస్ వరల్డ్

యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం చీరకట్టులో కొండపైకి చేరుకున్న ఆమె ముందుగా మాఢవీధుల్లోని ఈశాన్య ప్రాంతంలో గల అఖండజ్యోతికి మొక్కారు. గర్భగుడిలోకి వెళ్లి స్వయంభూ పంచ నారసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆమెకు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. ఆలయ ముఖ మండపంలో వేద ఆశీర్వచనం అందించారు. స్వామి లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేష వస్త్రాలను ఈవో భాస్కర్‌రావు అందజేశారు. -యాదగిరిగుట్ట

యాదగిరిగుట్టను పునర్నిర్మించింది కేసీఆరే

అసెంబ్లీలో వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): రాష్ర్టానికి తలమానికంగా నిలిచేలా యాదగిరిగుట్ట దేవాలయాన్ని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పునర్నిర్మించారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ ఆగమశాస్త్ర పండితులతో అనేకసార్లు చర్చించి, టీటీడీ తరహాలో తీర్చిదిద్దేందుకు నిర్విరామంగా శ్రమించారని వివరించారు. నాడు ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా ఆ పవిత్రకార్యంలో పాలుపంచుకొనే అవకాశం దక్కడం తన అదృష్టమని పేర్కొన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటుపై శాసనసభలో జరిగిన చర్చలో వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. ప్రపంచంలోనే కృష్ణశిలతో నిర్మించిన ఏకైక ఆలయం యాదగిరిగుట్ట అని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలోనే విమాన గోపురానికి 60 కిలోల బంగారం సేకరించామని స్పష్టంచేశారు. తాను, తన వియ్యంకుడు కలిసి కిలో, హరీశ్‌రావు రెండు కిలోలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కూడా విరాళమిచ్చారని వెల్లడించారు. టెంపుల్ సిటీ నిర్మాణానికి చర్యలు చేపట్టామని, వైటీడీఏ ఏర్పాటుపై ఆలోచించామని తెలిపారు. అంతలోనే ఎన్నికలు రావడం, అధికార మార్పిడి జరగడంతో విమాన గోపురాన్ని ప్రారంభించే అవకాశం కాంగ్రెస్‌కు వచ్చిందని పేర్కొన్నారు. హిందూ ధార్మిక ప్రచారానికి ప్రభుత్వం కేటాయించిన కోటి రూపాయలు సరిపోవని, రూ.5 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

జైలు నుంచి విడుదలవుతున్న మహిళా జర్నలిస్టులు రేవతి, తన్వీయాదవ్

మహిళా జర్నలిస్టుల విడుదల

- వాస్తవాలు చూపించినందుకే అక్రమ కేసులు
- జర్నలిస్టులు రేవతి, తన్వీయాదవ్ వెల్లడి
- అండగా నిలిచిన కేటీఆర్, సిబల్, సతీశ్ ఆచార్యకు కృతజ్ఞతలు

సైదాబాద్, మార్చి 18: చంచల్‌గూడ జైలు నుంచి మంగళవారం మహిళా జర్నలిస్టులు రేవతి, బండి సంధ్య అలియాస్ తన్వీయాదవ్ విడుదలయ్యారు. జైలు వద్ద మీడియాతో రేవతి మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరును విమర్శిస్తే అక్రమ కేసులు బనాయించి జైలులో నిర్బంధించారని చెప్పారు. తమపై పెట్టిన కేసు అక్రమమని అందరికీ తెలుసునని వెల్లడించారు. ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులకు భయపడేదిలేదని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పటికీ తమకు అండగా నిలువడానికి జైలు వద్దకు వచ్చిన కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, దాసోజు శ్రవణ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే పార్టీలకు అతీతంగా అండగా నిలిచిన వారికి, కపిల్ సిబల్, సతీశ్ ఆచార్య ఇలా ఎంతో మంది పెద్దలకు కృతజ్ఞతలు చెప్పారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో స్పందించిన జర్నలిస్టులందరికీ ధన్యవాదాలు తెలిపారు. బెయిల్ మంజూరు చేసిన న్యాయవ్యవస్థకు కృతజ్ఞతలు చెప్పారు. జర్నలిస్టు తన్వీయాదవ్ స్పందిస్తూ చానల్ ద్వారా ప్రజలకు వాస్తవాలు చూపిస్తుంటే తమ గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతున్నదని చెప్పారు.

వాస్తవాలు గమనించే బెయిల్: లలిత

మహిళా జర్నలిస్టులను కస్టడీకి ఇవ్వాలని పోలీసులు న్యాయస్థానాన్ని కోరినప్పటికీ తిరస్కరించిందని జర్నలిస్టుల తరపున వాదించిన న్యాయవాది లలితారెడ్డి చెప్పారు. మహిళా జర్నలిస్టులను అరెస్ట్ చేసే సమయంలో పోలీసులు దురుసుగా వ్యవహరించటంతోపాటు మహిళలు అనే కనికరం లేకుండా ఇబ్బందికరంగా అమానుషంగా ప్రవర్తించిన విషయాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లామని, దీంతో కోర్టు పోలీసులకు షోకాజ్ నోటీసు జారీ చేసిందని వెల్లడించారు.

జర్నలిస్టులపై 111 సెక్షనా?

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరు ప్రశ్నించినా వణికిపోతోంది. సామాన్యుడు ప్రశ్నించినా, ప్రతిపక్షం ప్రశ్నించినా, ఆఖరికి జర్నలిస్టులు ప్రశ్నించినా బెంబేలెత్తిపోతోంది. ప్రజాపాలనలో ప్రజలు తమ అభిప్రాయాన్ని చెప్పడం కూడా జీవితఖైదు విధించేంత తప్పుగా మారింది. ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న జర్నలిస్టులు ప్రశ్నిస్తే ఏకంగా మరణశిక్ష విధించేంత నేరంగా పరిగణిస్తోంది. మన రాజ్యాంగం దేశంలోని పౌరులందరికీ భావ ప్రకటన స్వేచ్ఛను కల్పించిందన్న విషయాన్ని మర్చిపోయి ప్రశ్నించే గొంతుకలను ఇబ్బంది పెడుతోంది. తీవ్రవాదులు, ఘోరమైన నేరాలు చేసేవారిపై ప్రయోగించే క్రిమినల్ చట్టాల్లోని సెక్షన్లను సామాన్యులు, జర్నలిస్టులపై ప్రయోగిస్తున్నది. ఇటీవల ప్రభుత్వాన్ని యూట్యూబ్ చానల్ ద్వారా ప్రశ్నించిన మహిళా జర్నలిస్టులు రేవతి, తన్వీ యాదవ్‌ను అరెస్టు చేయడంతోపాటు వారిపై బీఎన్‌ఎస్ చట్టంలోని వ్యవస్థీకృత నేరానికి సంబంధించిన 111, 61 (2), 353 (2), 352 సెక్షన్లను, 67 ఐటీ యాక్ట్‌ను ప్రయోగించింది. దీన్ని 'ఎడిటర్స్ గిల్డ్', న్యాయస్థానాలతోపాటు పలు వర్గాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

రేవంత్ సర్కార్ తీరుపై సీపీజే ఆందోళన

మహిళా జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు కక్షపూరితంగా ఉందని న్యూయార్క్‌కు చెందిన 'కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్' (సీపీజే) తమ పోర్టల్‌లో ఎండగట్టింది. ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారిని నడిరోడ్డుపై గుడ్డలూడదీసి కొడతామని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ బెదిరించడం ఆందోళనకరమని పేర్కొంది. పత్రికా స్వేచ్ఛను గౌరవిస్తామని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం ప్రతిజ్ఞ చేసినప్పటికీ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని సీపీజే ఆసియా ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ బెహ్‌లిహ్‌యి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ఇటువంటి బెదిరింపులు, దాడులను కట్టిపెట్టాలని, పత్రికా స్వేచ్ఛపై స్పష్టమైన వైఖరి తీసుకోవాలి కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వాన్ని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులు నోటిఫికేషన్లు వద్దన్నరట

- 'రాజీవ్ యువ వికాసం' ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి సంచలన వ్యాఖ్యలు
- సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలు
- జాబ్ క్యాలెండర్ ఏమైందని నిలదీత
- కాంగ్రెస్ సర్కారుపై నిరుద్యోగుల మండిపాటు

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): 'పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన ద్వారా పరీక్షల నోటిఫికేషన్లు వస్తూనే ఉన్నాయి.. అది ఏ స్థాయికి వెళ్లిందంటే ఒకప్పుడు నోటిఫికేషన్లు కావాలని ధర్నాలు చేసే పరిస్థితి ఉండేది. ఇప్పుడు నోటిఫికేషన్లు పెద్ద ఎత్తున రావడంతో కొంచెం గ్యాప్ ఇవ్వండని నిరుద్యోగులు అంటున్నారు. నోటిఫికేషన్లు వద్దని నిరుద్యోగులు ఆందోళనలు చేసే స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నది..' ఇవి 'రాజీవ్ యువ వికాసం' ప్రారంభోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు. ఉపముఖ్యమంత్రి హోదాలో అధికారిక కార్యక్రమంలో భట్టి విక్రమార్క చేసిన ఈ వ్యాఖ్యలు నిరుద్యోగుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమయ్యాయి. ఓ వైపు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తుంటే.. నోటిఫికేషన్లు వద్దంటున్నారని చెబుతారా? అని నిరుద్యోగులు దుమ్మెత్తిపోస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్లకు కాంగ్రెస్ ప్రభుత్వం నియామక పత్రాలు మాత్రమే అందజేసిందని, ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కారు తన తప్పును అంగీకరించి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని నిలదీస్తున్నారు. ఏడాది దాటినా నోటిఫికేషన్లు ఇవ్వకపోవడంపై నిరుద్యోగులు ఆందోళన చేస్తుంటే.. నోటిఫికేషన్లు వద్దని ఆందోళనలు చేస్తున్నారని అంటారా? అని ప్రశ్నిస్తున్నారు. 57 వేలకు పైగా ఉద్యోగాలు తమ ఘనతేనని కాంగ్రెస్ చెప్పున్నదని.. వాస్తవానికి 10-12 వేల ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్లు ఇచ్చిందని నెట్టింట యువత చర్చ పెడుతున్నది.

జాబ్ క్యాలెండర్ ఎక్కడ?

అసలు కొత్తగా నోటిఫికేషన్లు ఇవ్వకుండా 50 వేల ఉద్యోగాలు ఎలా ఇచ్చారో చెప్పాలని నిరుద్యోగులు నిలదీస్తున్నారు. గతేడాది అక్టోబర్‌లో గ్రూప్- 1 నోటిఫికేషన్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఇవ్వలేదని, జాబ్ క్యాలెండర్‌లో ప్రకటించిన ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదని మండిపడుతున్నారు. నిజంగా రాష్ట్రంలో భట్టి చెప్పిన పరిస్థితులే ఉంటే.. నిరుద్యోగులకు హామీ ఇచ్చిన రాహుల్‌గాంధీ తెలంగాణకు ఎందుకు రావడం లేదు? అని ప్రశ్నిస్తున్నారు. అశోక్‌నగర్‌లోని సెంట్రల్ లైబ్రరీని ఎందుకు రావడం లేదని, నిరుద్యోగులకు ఎందుకు ముఖం చాటేశారు? అని నిలదీస్తున్నారు. హైదరాబాద్‌లో యూత్ డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రియాంకా గాంధీ మళ్లీ ఎందుకు ఇక్కడికి అడుగు పెట్టడం లేదని మండిపడుతున్నారు. ఉద్యోగాలు ఇవ్వని పక్షంలో నిరుద్యోగులకు భృతి ఇస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని ధ్వజమెత్తుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో భట్టి భృతి విషయమై మాట మార్చిన వైనాన్ని గుర్తుచేసుకుంటున్నారు. భట్టి నిరుద్యోగులను వంచించేందుకు కంకణం కట్టుకున్నారని, అందుకే ఇప్పుడు మరోసారి నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి పచ్చి అబద్ధాలు చెప్పడం ఏమిటని, భట్టి నిరుద్యోగ ద్రోహిగా చరిత్రలో నిలిచిపోవడం ఖాయమని చెప్తున్నారు. కాంగ్రెస్ సర్కారు మోసాన్ని గ్రహించిన యువత ఇప్పటికే గుర్రుగా ఉన్నదని, ఇలాగే నమ్మకద్రోహం చేస్తే గద్దెనెక్కించిన చేతులతోనే మళ్లీ దించుతామని హెచ్చరిస్తున్నారు.

మన ఖర్మ.. ఏమీ చేయలేం

సెంట్రల్ వర్సిటీ భూముల వేలంపై దర్శకుడు నాగఅశ్విన్

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కు చెందిన 400 ఎకరాల భూములను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విక్రయిస్తుందన్న వార్తలపై ప్రముఖ సినీ దర్శకుడు నాగ్ అశ్విన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అసహనం వ్యక్తంచేశారు. భూముల విక్రయానికి సంబంధించిన వార్తను షేర్ చేసిన ఆయన 'మన ఖర్మ ..ఏమీ చేయలేం' అని వ్యాఖ్యానించారు. హెచ్‌సీయూలో వృక్షసంపద, అరుదైన వన్యప్రాణులు, పక్షిజాతులు నివాసమున్నాయి. ఈ విషయమై హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన ఓ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న నాగ్అశ్విన్ స్పందించారు. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ గురించి ఓ విలేకరి ప్రశ్నించారు. 'ప్రభుత్వం వేలం వేస్తున్న భూమి గ్రీన్ ఏరియా. అక్కడ ఎన్నో ఐటీ పార్కులున్నాయి. నాకు తెలిసి వాటిలో సగం వరకు ఖాళీగా ఉన్నాయి. నిజంగా అభివృద్ధి చేయాలంటే టైర్-2 సిటీస్‌పై దృష్టి పెట్టొచ్చు. కానీ 400 ఎకరాల్లో చెట్లు కొట్టకపోతేనే మంచిదనిపిస్తుంది' అని పేర్కొన్నారు. వీలుంటే ఆ భూములను కాపాడేందుకు మీడియా ప్రయత్నించాలని సూచించారు.

నిజం దాచినందుకు కోటి జరిమానా

- హైకోర్టు సంచలన తీర్పు
- న్యాయ సేవాధికార సంస్థకు చెల్లించాలని ఆదేశం
- న్యాయస్థానాలనే తప్పుదోవ పట్టిస్తారా?
- పిటిషనర్ తీరుపై న్యాయమూర్తి వ్యాఖ్యలు



హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): నిజం నిప్పులాంటిది. నిజాన్ని నిలువెత్తులో పాతర వేయాలనుకోవడం అవివేకం. నిజాన్ని దాచిపెట్టి కోర్టుల ద్వారా ఉత్తర్వులు పొందాలనే ప్రయత్నం చేసిన పిటిషనర్‌కు అక్షరాలా కోటి రూపాయలు జరిమానా విధిస్తున్నాం.. అని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక సంచలన తీర్పును వెలువరించారు. కోట్ల రూపాయల విలువైన భూమిని కాజేయాలనే తలంపుతో హైదరాబాద్‌కు చెందిన వెంకట్రామిరెడ్డి కోర్టుకు నిజం చెప్పకుండా చేసిన తప్పునకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. జరిమానా మొత్తాన్ని ఏప్రిల్ 10వ తేదీలోగా హైకోర్టు న్యాయ సేవాధికార సంస్థకు చెల్లించాలని పిటిషనర్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. ఒకవేళ జరిమానా మొత్తాన్ని చెల్లించకపోతే పిటిషనర్ వెంకట్రామిరెడ్డిని తమ ముందుంచాలని హైకోర్టు రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. హైదరాబాద్ జిల్లా బండ్లగూడ మండలం కందికల్ గ్రామం సర్వే నం. 310/1, 310/2లో తనకున్న 9.11 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు అధికారులు నిరాకరిస్తున్నారంటూ వెంకట్రామిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక మంగళవారం విచారణ చేపట్టారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ సర్వే నం. 23, 310/1, 310/2లో భూ వివాదం ప్రభుత్వానికి ఇతర ప్రైవేట్ వ్యక్తులకు మధ్య ఉన్నదని తెలిపారు. ఈ భూమి తన దేనంటూ పిటిషనర్ తండ్రికి విక్రయించారని చెబుతున్న ఆర్ వెంకటేశం సివిల్ కోర్టులో కేసు వేస్తే ప్రభుత్వానికి అనుకూలంగా 1998లో తీర్పు వచ్చిందని చెప్పారు. వెంకటేశం తండ్రి మరణించడంతో ఆయన కొడుకు ఆ కేసును కొనసాగిస్తున్నారని తెలిపారు. పిటిషనర్ వెంకట్రామిరెడ్డి ప్రతివాదుల పేరు మార్చడం ద్వారా వేర్వేరు ధర్మాసనాల వద్ద వ్యాజ్యాలు దాఖలు చేస్తూ అనుకూల ఉత్తర్వులు పొందేందుకు చట్ట వ్యతిరేక చర్యలకు తెరతీశారని చెప్పారు. న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకం కోసం 2022 డిసెంబరులో పిటిషన్ వేసి తర్వాత ఏడాది మార్చిలో ఉపసంహరించుకున్నారని చెప్పారు. రెవెన్యూ రికార్డుల్లో సవరణకు 2023 ఫిబ్రవరిలో పిటిషన్ దాఖలు చేసి ఆ తర్వాత ఏడాది ఉపసంహరించుకున్నారని తెలిపారు. ఈ విధంగా ఫోరం షాపింగ్ (వ్యూహాత్మకంగా కోర్టుల్లో అనుకూలమైన ఉత్తర్వులు పొందే ప్రయత్నం) కుట్రలను అడ్డుకోవాలని కోరారు. గత ఏడాది వాస్తవాలను తొక్కిపెట్టి స్టేటస్ కో ఉత్తర్వులు, కింది కోర్టులో శాశ్వత ఇంజంక్షన్ ఆర్డర్ పొంది తిరిగి పోలీసుల రక్షణ కోసం పిటిషన్లు వేశారని తెలిపారు. ఈ వివాదం వెంకటేశం-ప్రభుత్వం మధ్యనే ఉందని, పిటిషనర్‌కు సంబంధం లేదని చెప్పారు. వాదనల తర్వాత పిటిషనర్ తీరుపై న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కోర్టులో పిటిషన్ దాఖలు చేసినపుడు వివాదానికి సంబంధించిన సమగ్ర వివరాలు ఎందుకు సమర్పించలేదని మండిపడ్డారు. తనకు అనుకూలంగా ఉత్తర్వులను పొందడానికి వాస్తవాలను తొక్కిపెట్టారని తేల్చారు. ఇందుకోసం ప్రతివాదులతోపాటు హైకోర్టునూ తప్పుదోవ పట్టించారని అన్నారు. ఇలాంటి పనికిమాలిన కేసు వల్ల కోర్టులపై అనవసర పనిభారం పడుతున్నదని చెప్పారు. కోర్టులపైన, జడ్జీలపై పని ఒత్తిడి పెరుగుతున్నదని తెలిపారు. న్యాయం కోసం కోర్టులకు వచ్చే వాళ్లకు న్యాయం జాప్యం అవుతుందని అన్నారు. నిజాలు దాచిపెట్టి న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నాలను చూస్తూ ఉండబోమని హెచ్చరించారు. న్యాయపరిపాలన కలుషితం కాకుండా చూస్తామన్నారు. నిజం దాచి కేసులు వేసిన పిటిషనర్‌కు కోటి రూపాయల జరిమానా విధిస్తున్నట్టు ప్రకటించారు. ఈ మొత్తాన్ని హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీకి ఏప్రిల్ 10 లోగా చెల్లించాలని ఆదేశిస్తూ తీర్పు వెలువరించారు.

మేడిగడ్డ కేసులో జిల్లా కోర్టు వ్యాఖ్యలు రద్దు

పిటిషన్ విచారణార్హమో కాదో తేల్చాలి

సెషన్స్ కోర్టుకు హైకోర్టు ఉత్తర్వులు

కేసీఆర్, హరీశ్ పిటిషన్లపై తీర్పు

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ కుంగుబాటుపై దర్యాప్తు జరపాలన్న ప్రైవేటు ఫిర్యాదును మేజిస్ట్రేట్ కొట్టివేసిన తర్వాత దాఖలైన రివ్యూ పిటిషన్‌పై భూపాలపల్లి జిల్లా కోర్టు చేసిన వ్యాఖ్యలను హైకోర్టు రద్దు చేసింది. ప్రైవేట్ ఫిర్యాదును కొట్టేస్తూ మేజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై రివిజన్ పిటిషన్ విచారణార్హమో కాదో జిల్లా కోర్టు తేల్చాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ లక్ష్మణ్ మంగళవారం తీర్పు వెలువరించారు. మేడిగడ్డ కుంగుబాటుపై ప్రైవేటు ఫిర్యాదును మేజిస్ట్రేట్ కోర్టు కొట్టివేయడంతో ఫిర్యాది నాగవల్లి రామలింగమూర్తి జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి కోర్టులో రివ్యూ పిటిషన్ వేశారు. విచారించిన కోర్టు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్‌రావుకు నోటీసులు జారీచేసింది. నోటీసులను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పు వెలువరించింది. సెషన్స్ జడ్జి తన ముందున్న పిటిషన్ విచారణార్హమా కాదా అనే అంశానికి మాత్రమే పరిమితం కావాలని న్యాయమూర్తి పేర్కొన్నారు.

నిషేధిత ఆస్తుల జాబితా వెల్లడిపై నోటీసులు

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): నిషేధిత జాబితాలో ఉన్న ఆస్తులు, భవనాల జాబితాను వెల్లడించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద ప్రభుత్వం నిబంధనల ప్రకారం గెజిట్ విడుదల చేశాక నిషేధిత ఆస్తుల జాబితాను వెల్లడించాలని పిటిషనర్ చంద్రసేనారెడ్డి వాదించారు. కోర్టు వివాదాల్లో ఉన్న ఆ ఆస్తుల వివరాలను స్థానిక కార్యాలయాల్లో అందుబాటులో ఉంచితే ప్రజలు అప్రమత్తంగా ఉంటారని, అలాంటి ఆస్తులను కొనుగోలు చేయకుండా జాగ్రత్త పడతారని తెలిపారు. దీంతో ప్రజలకు సమాచారాన్ని అందించేందుకు నిషేధిత జాబితాలో ఉన్న ఆస్తులు, భవనాల జాబితాను ప్రకటించడంపై అభ్యంతరాలేమైనా ఉంటే చెప్పాలని యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ యారా రేణుక ధర్మాసనం ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.